క్లుప్తంగా

ఎరువుల వినియోగం తగ్గించాలి


నవుడూరుగరువులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రహీమ్

మొగల్తూరు: ఎరువులు వినియోగం తగ్గించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. శేరేపాలెం పంచాయతీ నవుడూరుగరువులో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సార్వా సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించుకోవాలన్నారు. గ్రామంలోని వ్యవసాయ భూములను పరిశీలించి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ–క్రాప్ నమోదు వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రాయితీ వంటివి పొందవచ్చున్నారు. ఈ సమావేశంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వెయ్యి లీటర్లకు చేరుకున్న పాలసేకరణ


కొప్పర్రులో పాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సురేంద్ర

మొగల్తూరు: జగనన్న పాలవెల్లువ పథకంలో నరసాపురం మండలంలో పాల సేకరణ వెయ్యి లీటర్లకు చేరుకుందని వెటర్నరీ డాక్టర్ ఇంజేటి సురేంద్ర బుధవారం తెలిపారు. పాల సేకరణపై పాడి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం పాల ధరను పెంచడంతో పాలసేకరణ పెరిగిందన్నారు. మండలంలోని కొప్పర్రు కేంద్రం ద్వారా 179 లీటర్లు, సరిపల్లి 172 లీటర్లు, లక్ష్మణేశ్వరం 94 లీటర్లు, సీతారాంపురం 152 లీటర్లు, సారవ 102 లీటర్లు, ఎల్‌బీచర్ల 127 లీటర్లు, వైఎస్ పాలెం కేంద్రం ద్వారా 174 లీటర్ల పాలు సేకరిస్తున్నామన్నారు. పాలు అందించే ప్రతి రైతుకు పారదర్శకంగా వారి వారి ఖాతాలో నగదు జమ చేస్తున్నామన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన


పెనుమంట్రలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ప్రచార యాత్ర

పెనుమంట్ర: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నిరుద్యోగ సమస్యలు పరిష్కారం, ధరలను అదుపు చేయడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బుధవారం సీపీఎం పిలుపుమేరకు పెనుమంట్రలో సీపీఎం ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు కేంద్రం లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై పన్నులు భారం మోపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూసంపూడి సుబ్బరాజు, కోడెల్లి శ్రీనివాస్, బి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దేశ రక్షణకు యువత ముందుకు రావాలి


రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రాంజీని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: దేశ రక్షణకు యువత ముందుకు రావాలని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కోరుకొండ రాంజీ అన్నారు. బుధవారం ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన మేరీ మాటీ మేరా మహాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ భరతమాత గడ్డపై పుట్టిన ప్రతీ ఒక్కరూ భరతమాత రుణం తీర్చుకోవాలన్నారు. యువత ఎప్పుడూ దేశ సేవ కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కె.మురళీకృష్ణ, అధ్యాపకులు ఎస్వీ రావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సాక్షి, భీమవరం: ఇద్దరు వ్యక్తులు గొడవపడుతుండగా మధ్యలో వెళ్లిన మరొకరికి గాయాలైన ఘటన ఇది. భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుంకర పద్దయ్య వీధికి చెందిన నమ్మి శ్రీను మంగళవారం రాత్రి కొత్త బస్టాండ్ వద్దకు వెళ్లగా అక్కడ పిల్లి ఏసు, ఒక ఆటో డ్రైవర్ గొడవ పడుతున్నారు. పిల్లి ఏసు ఆటో డ్రైవర్‌ను కర్రతో కొట్టబోయి శ్రీనును కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు.

వేగంగా హిందూ శ్మశానవాటిక అభివృద్ధి

- రూ.1.98 కోట్లతో గోదావరిగట్టున నిర్మాణం
- అధునాతన సౌకర్యాలు ఏర్పాటు


వేగంగా సాగుతున్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు

నరసాపురం: గోదావరి గట్టున కొండాలమ్మగుడి సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ 1.98 కోట్లతో అధునాతన సౌకర్యాలతో శ్మశానవాటిక నిర్మిస్తున్నారు. పట్టణంలో ప్రధానమైన ఈ శ్మశానవాటిక అధ్వానంగా తయారైంది. గత మున్సిపల్‌పాలకవర్గాలు ఈ సమస్యపై పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. చుట్టూ చెత్త, దుర్గంధంతో శవ దహనానికి చేయడానికి వచ్చే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి షెడ్డుగాని, దహన సంస్కారాలు, స్నానాలు చేయడానికి సౌకర్యాలు లేవు. ఇక వర్షం వస్తే పరిస్థితి దారుణం. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుమార్గం కూడా పాడైంది.

రూ.1.98 కోట్లతో నిర్మాణం..

ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవతో శ్మశానవాటికను స్మృతివనం తరహాలో అభివృద్ధి చేయడానికి నిర్ణయించి పనులు మొదలు పెట్టారు. దహన సంస్కారాలు కోసం గ్యాస్‌తో మండే చితిని, పక్కన పుల్లలతో కాల్చే చితిని వేర్వేరుగా నిర్మిస్తున్నారు. రెండు షెడ్డులు, చుట్టూ ప్రహరీగోడ, గోదావరి వద్ద ప్రత్యేకంగా స్నానాల రేవు నిర్మిస్తున్నారు. శ్మశానవాటికకు వచ్చే రోడ్డును నిర్మిస్తున్నారు. పక్కనే ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి అందులో దహన సంస్కారాలకు వచ్చేవారు కూర్చోవడానికి సిట్టింగ్, అలాగే మంచినీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పూలమొక్కలు, చెట్లు వేసి అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పనులు వేగంగా సాగుతున్నాయి.

ఇబ్బందులు లేకుండా నిర్మాణం



హిందూ శ్మశాన వాటికను రూ 1.98 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. దాదాపు 40శాతం పనులు పూర్తయ్యాయి. దహన సంస్కారం కోసం గ్యాస్ ఆధారిత యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పక్కన అన్ని వసతులతో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చుట్టూ ప్రహరీగోడ కూడా నిర్మిస్తున్నాం. శవ దహనానికి వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడతాము.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

మహిళలకు అండగా ఉంటాం


నరసాపురంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


పాలకొల్లులో టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబుకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం రూరల్: ×నాపై చూపుతున్న సోదర ప్రేమకు కృతజ్ఞతుడిని, ఒక అన్నగా, తమ్ముడిగా ప్రతీ సోదరికీ అండగా ఉంటాను× అని రాష్ట్ర ప్రపభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం స్థానిక అల్లూరి కల్యాణ మండపంలో రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా జరిగిన నియోజకవర్గస్థాయి రక్షా బంధన్ సంబరాల్లో ప్రసాదరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాఖీలు కట్టేందుకు మహిళలు పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలిపి ఆయన చేతికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ నాపై ఆదరాభిమానాలు చూపుతున్న మీ అందరి ఆకాంక్షలకు అనుగుణంగా నడచుకుంటానన్నారు. నరసాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన అన్నారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా వారి రక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తున్నందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని, ఏ పథకం చూసినా మహిళలకు అధిక ప్రాధాన్యత నిస్తూ ప్రవేశ పెడుతున్నారని ఆయన అన్నారు. నామినేటెడ్ పదవులలో 50 శాతం రిజర్వేషన్ కలిప్పించి చట్టం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం సోదరీ మణులకు రక్షాబంధన్ సందర్భంగా చిరుకానుకులను అందజేశారు.

పాలకొల్లులో.

పాలకొల్లు అర్బన్: సోదర ప్రేమకు ప్రతీకగా రక్షా బంధన్ నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. యాళ్లవానిగరువులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పలువురు పార్టీ మహిళలు గుడాల గోపికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్ద పీట వేసి మహిళా పక్షపాతిగా నిలిచి పెద్దన్నగా నిలిచారన్నారు. పార్టీ మహిళలు మద్దా చంద్రకళ, కుడుపూడి నాగలక్ష్మి, షేక్ ఖాండ్ బీబీ, నడింపల్లి అన్నపూర్ణ, పెచ్చెట్టి లక్ష్మీ విమల, కాసా విజయ దుర్గా భవాని, పైలా వరలక్ష్మి, కుసుమే ఝాన్సీ హేమలత, కడలి రామలక్ష్మి, పితాని లక్ష్మి, మాముడూరి నాగమణి తదితరులు గుడాల గోపికి పుష్పగుచ్ఛాలు అందజేసి రాఖీ కట్టారు.

పూలపల్లిలో...

పూలపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు మేకా శేషుబాబుకి బ్రహ్మకుమారీస్ పుష్పగుచ్ఛాలు అందజేసి రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టి రక్షా బంధన్ విశిష్టతను చాటారు.

రసధుని ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం


కవి పెద్దిరాజును సన్మానిస్తున్న రసధుని సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారు కూడా ఉన్నత స్థానాలకు చేరుకున్నారని రసధుని పట్టణ అధ్యక్షులు కొట్టి భాస్కరరావు అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో రసధుని ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఎన్ని భాషల్లో ప్రావీణ్యం ఉన్నా కమ్మనైన అమ్మ భాషను మాత్రం మరువకూడదని అన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ కవి మామిడిశెట్టి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీవీ తిరుపతిరాజు, సీవీవీ సత్యనారాయణమూర్తి, ఇనుకొండ రంగారావు, చేగొండి రంగారావు, కోలాటి పెద్దిరాజు, కొల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

భీమవరం అర్బన్: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో బుధవారం మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో వరి పొలాలను రెండు లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. చీడపీడలు తట్టుకునే వరి వంగడాలను పంటకు ఎంచుకోవాలన్నారు. ఎకరానికి 4 టన్నుల పశువుల పేడను దుక్కుల్లో వేయాలన్నారు. పచ్చిరొట్ట సాగు చేసి దమ్ము చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. కిలో విత్తనాలకు 10 గ్రాముల సూడోమోనాస్ లేదా 3 గ్రాముల కార్బన్ డిజంతో విత్తన శుద్ధి చేస్తే తప్పలు తాళ్లు వేచ్చే అవకాశాలు ఉండవన్నారు. వరినారి చివర కొనలు తుంచి నాటితే కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. వరి నారిని పైపైన నాటితే పిలకలు వేసి వరి దుబ్బు చేస్తుందన్నారు. మురుగునీటిని బయటకు పంపే సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరానికి నత్రజని 32–36 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాషియం 16–24 కిలోల మధ్య వేయాలన్నారు. సమగ్ర కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, ఎలుకల నివారణ, కోత దశలోను సస్య రక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ ఆరేటి వెంకట సత్య వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు), డీఆర్‌సీ వ్యవసాయ అధికారిని జి.బాల నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపునకు టీడీపీ కుట్ర

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: టీడీపీ ప్రజాబలం పూర్తిగా కోల్పోయిందని, దీంతో దొడ్డి దారిన అధికారంలోకి రావాలని చంద్రబాబు నానా తంటాలు పడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో పదివేల వైఎస్సార్ సీపీ ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దీనిలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో 10 వేల మంది వైఎస్సార్ సీపీ ఓట్లను తొలగించేందుకు ఇక్కడ టీడీపీ నాయకులు కుట్ర చేశారని ఆరోపించారు. బతికున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను మరణించినట్లుగా చూపించి వారి ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్ట ప్రకారం తాము ఓటర్ల జాబితాను తీసుకుని పరిశీలించడం జరిగిందని అన్నారు. తన తల్లి గ్రంధి వెంకటరత్నం, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, నాచు శేషగిరిరావు లాంటి అనేకమంది బతికుండగానే వారు మరణించారని ఎన్నికల అధికారులకు టీడీపీ తప్పుడు రిపోర్ట్ చేయడం చాలా దారుణమని అన్నారు. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉన్నాయని చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయటం చాలా విచిత్రంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ దొంగ ఓట్లు జాయిన్ చేస్తుంది అని చెప్పడం చూస్తుంటే దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి సంబంధించిన 10 వేల ఓట్లు తొలగించాలని టీడీపీ కుట్ర చేయాలని ప్రయత్నించడం చూస్తుంటే నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి పూర్తిగా దిగజారిందని అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 3.60 కోట్ల ఓట్లు ఉంటే ఆ జాబితాలో 60 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి చంద్రబాబు జాయిన్ చేసిన దొంగ ఓట్లను తొలగిస్తున్నారని, దీంతో చంద్రబాబుకు ఆందోళన మొదలై 2024 ఎన్నికలలో గత ఎన్నికలలో వచ్చిన 23 సీట్లు కూడా రావనే భయంతో బురద జల్లుతున్నారని విమర్శించారు. కాగా 60 సంవత్సరాల వయసు పైబడి పెన్షన్ తీసుకుంటున్న వారందరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేస్తారనే అనుమానంతో డెత్ ఓట్లుగా పదివేల ఓట్లు తొలగించమని ఫిర్యాదు చేయటంపై చంద్రబాబు నీచ రాజకీయం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు సరైన గుణపాఠం ప్రజలే చెబుతారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు

వీరవాసరం: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దయానంద్ తెలిపారు. మండల కేంద్రమైన వీరవాసరం, అండలూరు, రాయకుదురు గ్రామాల్లో మంచినీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచనల మేరకు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో జరుగుతున్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకారావు, గెడ్డం భాస్కరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాధిక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని రాయకుదురు సర్పంచ్ గెడ్డం భారతి అన్నారు. వీరవాసరం మండలం రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్, రికార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భారతి మాట్లాడుతూ బ్లూ పార్క్ హేచరీ అధినేత కే వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు సుమారు రూ.35 వేల ఆర్థిక సహాయంతో స్టడీ మెటీరియల్, రికార్డు బుక్స్‌ను విద్యార్థులకు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యా కమిటీ చైర్మన్ గుబ్బల సత్యనారాయణ, గెడ్డం భాస్కరరావు, కాయల వీరాస్వామి, గెడ్డం ముసలయ్య. అంగర వేణు, మెంటే అరుణ, లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

సాక్షి, భీమవరం: భీమవరం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చిన్మయ ప్రభ ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఇమిడి వెంకటరత్నం హాజరై మాట్లాడుతూ సమాజ సేవ చేయడానికి రోటరీ క్లబ్ ఒక మంచి వేదిక అని అన్నారు. భీమవరం రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గుండు కిషోర్ , షేక్ బాబాజీ సాహెబ్, కోశాధికారిగా బొండా వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా అమృఖలాల్ జైన్, జాయింట్ సెక్రెటరీగా వీవీఎస్ ప్రసాద్, 25 మంది నూతన సభ్యులతో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. నూతన సభ్యులకు అసిస్టెంట్ గవర్నర్ రోటరీ బ్యాడ్జీలు అందజేశారు. బొండా వెంకట సుబ్బారావు, వబిలిసెట్టి పట్టాభి రామయ్య, మడిపల్లి శేఖర్, సాయి దుర్గా ప్రసాద్, గంధ శ్రీదేవి, ఓలేటి శ్రీనివాస్, కనగల కిషోర్, గుండు గిరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు తీరు పరిశీలన


నరసాపురం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శిస్తున్న అధికారుల బృందం

మొగల్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును కేంద్ర ప్రభుత్వ అధికారులు రెండో రోజు బుధవారం నరసాపురం మండలంలో పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్‌లోని వివిధ శాఖలకు చెందిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం నరసాపురం మండలంలో పర్యటించింది. తూర్పుతాళ్ళు గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాసయోజన పథకంలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. పెదమైనవానిలంకలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అందించిన నిధులతో చేపట్టిన కార్యాలయ భవనాలును, డిజిటల్ లైబ్రరీని సందర్శించి, స్కిల్ డెవలప్‌మెంట్‌లో అందిస్తున్న శిక్షణా కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నరసాపురంలో డ్వాక్రా మహిళలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్టును సందర్శించారు. సరపల్లిలోని సచివాలయాన్ని సందర్శించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసున్న సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరసాపురంలో ఎంపీడీవో శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఈటీపీఆర్డీ నవీన్ కిరణ్ హేమంత్ మీనా, నిషి ఇండోరా, బాసుదేవ్ యాదవ్, మయాంక్ అగర్వాల్, విశాల్, హిమాన్స్ షైనీ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన



వైఎన్ కాలేజీలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ వెంకటరత్నం

మొగల్తూరు: చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించుకోవాలని వైఎన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకట రత్నం కోరారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైఎన్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను పూర్వ కాలంలో ఎక్కువగా వినియోగించడంతో వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉండేవారన్నారు. ప్రస్తుతం జంక్ పదార్థాలైన పిజ్జా, బర్గర్, బిర్యానీలు తినడం ద్వారా చిన్న వయస్సులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. సమావేశంలో కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ ఓసూరి కుసుమరత్నం, సామాజిక సేవా విభాగం కో ఆర్డినేటర్ బి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి యాకోబ్ పాల్గొన్నారు.

ఎంఆర్‌వీకి గిడుగు రామ్మూర్తి పురస్కారం


హైదరాబాదులో గిడుగు రామ్మూర్తి పురస్కారాన్ని అందుకుంటున్న ఎంఆర్‌వీ

పెనుగొండ: పెనుగొండకు చెందిన కథారచయిత ఎంఆర్‌వీ సత్యనారాయణ మూర్తి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు బుధవారం ఎంఆర్‌వీ పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి ముని మనమలు గిడుగు కాంతికృష్ణ స్థాపించిన గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ పురస్కారాల సభలో అందుకున్నట్లు వివరించారు. తెలంగాణ బీసీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహనరావు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రచయిత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాశేశ్వరం శంకరరావు, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సంగీత దర్శకుడు బుద్దుస్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

పార్టీకి అంకితభావంతో పని చేయాలి


పొత్తూరి బుచ్చిరాజును కలిసి కృతజ్ఞతలు చెబుతున్న బోనం బులి వెంకన్న

యలమంచిలి: వైఎస్సార్ సీపీలో ఏ హోదాలో ఉన్నా పార్టీపై అంకితభావంతో పని చేసి ఆ పదవికి సార్థకత చేకూర్చాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యునిగా నియమితులైన బూరుగుపల్లి గ్రామానికి చెందిన బోనం బులి వెంకన్న బుధవారం పార్టీ నాయకులతో కలిసి కలగంపూడి వెళ్లి బుచ్చిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరాజు బులి వెంకన్నను అభినందించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బుచ్చిరాజును కలిసిన వారిలో పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, శిరగాలపల్లి, లక్ష్మీపాలెం సర్పంచ్‌లు చిలుకూరి సుబ్బారావు చౌదరి, గటిగంటి మహేష్ నాయకులు ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, పొత్తూరి రంగరాజు తదితరులు ఉన్నారు.

కాకినాడ టు విజయవాడ వయా నరసాపురం సర్వీస్ ప్రారంభం

నరసాపురం రూరల్: కాకినాడ నుంచి అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం, విజయవాడ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి కాకినాడ డిపో వారు కాకినాడ నుంచి విజయవాడ బస్సు సర్వీసును ప్రారంభించినట్లు నరసాపురం డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి తెలిపారు. ఈ బస్సు వయా అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం మీదుగా విజయవాడకు వెళ్తుందన్నారు. ఈ అల్ట్రా డీలక్స్ బస్సు కాకినాడలో ఉదయం 5గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. మళ్లీ తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 10.30 గంటలకు కాకినాడ చేరుకుంటుందన్నారు. అలాగే విజయవాడ నుంచి గవర్నర్‌పేట డిపో కాకినాడకు పైన తెలిపిన రూట్‌లోనే మరో బస్సును నడుపుతున్నారన్నారు. అయితే ఈ బస్సు విజయవాడలో ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 01.55కు కాకినాడ చేరుకుంటుందన్నారు. తిరిగి కాకినాడలో సాయంత్రం 4.45కు బయలుదేరి రాత్రి 12.15గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని మేనేజర్ తెలిపారు.